క్లుప్తంగా

29న తెలుగు భాషా దినోత్సవం

కడప ఎడ్యుకేషన్: సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో 'వ్యావహారిక భాషా పితామహుడు' గిడుగు వెంకట రామమూర్తి 162వ జయంతిని పురస్కరించుకుని ఈనెల 29వ తేదీ ఉదయం 10 గంటలకు తెలుగు భాషా దినోత్సవాన్ని నిర్వహిస్తున్నట్లు సి.పి.బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రం సంచాలకులు ఆచార్య జి.పార్వతి పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో 'తెలుగు భాష - గిడుగు వెంకట రామమూర్తి కృషి' అనే అంశంపై శ్రీవేంకటేశ్వర విశ్వవిద్యాలయ విశ్రాంత ఆచార్యులు ఆచార్య మేడిపల్లి రవికుమార్ (తిరుపతి) ప్రసంగిస్తారన్నారు.

రాష్ట్ర మహాసభలు జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: ఈ నెల 30, 31 తేదీల్లో జిల్లాలో జరిగే ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ 3వ రాష్ట్ర మహాసభలను జయప్రదం చేయాలని ఏపీ ఆశా వర్కర్స్ యూనియన్ రాష్ట్ర అధ్యక్షురాలు పి. సుభాషిణి పిలుపునిచ్చారు. మంగళవారం స్థానిక జిల్లా ఏఐటీయూసీ కార్యాలయంలో జిల్లా ఆశా ముఖ్య కార్యకర్తల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ కడపలో రెండు రోజులపాటు మహాసభలు నిర్వహిస్తున్నట్లు పేర్కొన్నారు. నగరంలో భారీ ప్రదర్శన, వైఎస్ఆర్ ఆడిటోరియంలో సభ నిర్వహిస్తున్నట్లు వివరించారు. ఆశా వర్కర్స్ ను మెడికల్ ఉద్యోగులుగా గుర్తించి పర్మినెంట్ చేయాలని, అంతవరకు ఉద్యోగ భద్రత కల్పించి కనీస వేతనం రూ. 26 వేలు ఇవ్వాలన్నారు. ఈ సమావేశంలో ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షులు గుంటి వేణుగోపాల్, జిల్లా నాయకులు పి చంద్రశేఖర్, యూనియన్ జిల్లా అధ్యక్షురాలు యు మరియమ్మ, జిల్లా వర్కింగ్ ప్రెసిడెంట్ పివి రమణమ్మ, డిప్యూటీ జనరల్ సెక్రెటరీ బి శాంతమ్మ, జిల్లా కోశాధికారి సి అమ్ములు, జిల్లా ఉపాధ్యక్షులు వరలక్ష్మి, శోభారాణి, అనసూయ, డోరతి, ఉమామహేశ్వరి, నగర అధ్యక్షులు లక్ష్మీ నరసమ్మ, అనిత, పార్వతి, రేణుక పాల్గొన్నారు.

ఆలయ దర్శన వేళలు మార్చాలి

కడప సెవెన్‌రోడ్స్ : కడప నగరం మృత్యుంజయకుంటలో ఉన్న శ్రీ మృత్యుంజయేశ్వర స్వామి ఆలయ దర్శన వేళలు శైవాగమ శాస్త్రం ప్రకారం మార్పులు చేయాలని తాళపత్ర గ్రంథ లిపి నిపుణులు నాగదాసరి మునికుమార్ కోరారు. మంగళవారం ఎండోమెంట్ జిల్లా సహాయ కమిషనర్‌కు ఈ మేరకు వినతిపత్రం సమర్పించారు. ప్రస్తుతం ఉదయం 10 గంటల వరకే ఆలయం తెరిచి ఉండడం వల్ల భక్తులు దర్శించుకోలేక పోతున్నారన్నారు. ఈ అంశాన్ని పరిశీలించి ఉదయం 6.30 గంటల నుంచి సాయంత్రం 8.30 గంటల వరకు ఆలయాన్ని భక్తుల దర్శనం కోసం తెరిచి ఉంచాలన్నారు.

బస్ స్టాప్ ఏర్పాటు చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగర శివార్లలోని 3వ డివిజన్ పరిధి లో గల పుచ్చలపల్లి సుందరయ్య నగర్ కు 'బస్ స్టాప్ ' ఏర్పాటు చేయాలని సీపీఐ(ఎంఎల్) లిబరేషన్ జిల్లా కార్యదర్శి బందెల ఓబయ్య పేర్కొన్నారు. మంగళవారం పుచ్చలపల్లి సుందరయ్య నగర్‌కు బస్ స్టాప్‌ను ఏర్పాటు చేయాలని కోరుతూ సిపిఐ (ఎంఎల్) లిబరేషన్ నాయకులు ఆర్టీసీ ఆర్ఎంవో గోపాల్ రెడ్డికి వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సుందరయ్య నగర్ కాలనీ ఏర్పాటు అయి 20 సంవత్సరాలు పైబడి ఉందని, ఇక్కడ దాదాపు 600 కుటుంబాలు జీవిస్తున్నట్లు తెలిపారు. ఈ నేపథ్యంలో కడప-తిరుపతి నేషనల్ హైవే లో ఉన్న సుందరయ్య నగర్ కు బస్ స్టాప్ ఏర్పాటు చేయాలని కోరారు.

భూమిరెడ్డి ఆత్మహత్య వెనుక వాస్తవాలను వెలికితీయాలి


జిల్లా ఎస్పీ ఈ.జి అశోక్‌కుమార్‌ను కలిసి వినతిపత్రం సమర్పిస్తున్న అఖిలపక్షం నేతలు

కడప అర్బన్: బ్రహ్మంగారి మఠం మండలం లింగాలదిన్నె పల్లెలోని భూమిరెడ్డి సుబ్బిరెడ్డి ఆగస్టు 4వ తేదీ ఆత్మహత్య ప్రయత్నం చేయటం అపారక స్థితిలో ప్రొద్దుటూరులోని హాస్పిటల్ లో చికిత్స పొందుతూ ఈనెల 8 వ తేదీ మృతి చెందిన విషయం పై సమగ్ర విచారణ జరిపించాలని అఖిలపక్షం ఆధ్వర్యంలో మంగళవారం ఎస్పీ ఈ.జీ అశోక్‌కుమార్‌ను కలసి వినతిపత్రం ఇచ్చారు. అనంతరం అఖిలపక్ష నాయకులు నారాయణ, సగిలి గుర్రప్ప రవిశంకర్ రెడ్డి, ఎస్.ఏ సత్తార్, బిఆర్‌కె ప్రసాద్, బందెల ఓబయ్య మాట్లాడారు. ఈవిషయం పై అఖిలపక్ష కమిటీ ఆధ్వర్యంలో సుబ్బిరెడ్డి కుటుంబాన్ని పరామర్శించామని, బాధితులను అడిగి తెలుసుకుని, స్థానిక బి మఠం పోలీస్ స్టేషన్‌లో లెక్కల రమణారెడ్డి మరికొందరిపై బాధిత కుటుంబ సభ్యులతో కలిసి ఫిర్యాదు చేశామన్నారు. సుబ్బిరెడ్డి, లెక్కల రమణారెడ్డికి మధ్య కొన్ని సంవత్సరాలుగా భూమి తగాదాలు ఉన్నాయన్నారు. ఈ విషయంపై బి.మఠం పోలీస్ స్టేషన్ వెళ్లి వచ్చిన తర్వాత భూమిరెడ్డి సుబ్బిరెడ్డి పురుగుల మందు తాగి ఆత్మహత్య ప్రయత్నం చేసుకున్నాడని తెలిపారు. ఈ ఘటనపై ఎస్పీకి విన్నవించామని, ఆయన సమగ్ర విచారణ జరిపించి కుటుంబానికి అండగా నిలుస్తామని హామీ ఇచ్చారని వారు తెలిపారు. ఈ కార్యక్రమంలో దేవర కృష్ణ, మధు, దాదా పీర్ పాల్గొన్నారు.

పర్యావరణ పరిరక్షణకు కృషి


మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తున్న మేయర్ సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా

కడప కార్పొరేషన్: మట్టి వినాయక విగ్రహాలను వాడటం వల్ల పర్యావరణానికి మేలు జరుగుతుందని నగర మేయర్ కె. సురేష్ బాబు, మాజీ డిప్యూటీ సీఎం అంజద్‌బాషా అన్నారు. మంగళవారం సాయంత్రం 23వ డివిజన్ కార్పొరేటర్ టి. విజయలక్ష్మి, వైఎస్సార్‌సీపీ నాయకులు ఐస్‌క్రీం రవి ఆధ్వర్యంలో మట్టి వినాయక విగ్రహాలను ఉచితంగా పంపిణీ చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ సుమారు 10 సంవత్సరాలుగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేస్తూ పర్యావరణ పరిరక్షణకు తన వంతు కృషి చేస్తున్న ఐస్‌క్రీం రవి దంపతులను అభినందించారు. ప్రజలందరికీ వినాయక చవితి శుభాకాంక్షలు తెలిపారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మహిళా విభాగం జిల్లా అధ్యక్షురాలు టీపీ వెంకట సుబ్బమ్మ, కార్పొరేటర్లు షఫీ, శ్రీలేఖ, వైఎస్సార్‌సీపీ నాయకులు దాసరి శివ ప్రసాద్, శ్రీరంజన్‌రెడ్డి, రామక్రిష్ణారెడ్డి, ఏపీయూడబ్ల్యూజే నాయకులు వెంకటరెడ్డి, వెన్ను శ్రీనివాస్, రామాంజనేయరెడ్డి, శివరామ్ తదితరులు పాల్గొన్నారు.


భక్తులకు మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న ప్రతినిధులు


మట్టి గణపతి విగ్రహాలను పంపిణీ చేస్తున్న సుల్తాన్‌బాబా


మట్టి విగ్రహాలు పంపిణీ చేస్తున్న మానవత సంస్థ ప్రతినిధులు


మట్టి విగ్రహాలను పంపిణీ చేస్తున్న కందుల విద్యాసంస్థల అధినేత చంద్ర ఓబుల్‌రెడ్డి

కడప సెవెన్‌రోడ్స్ : వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మానవత సంస్థ ప్రతినిధులు భక్తులకు వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. మంగళవారం మున్సిపల్ ఆఫీస్ దగ్గర మెయిన్ రోడ్డులో ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. మానవతా సంస్థ నగర అధ్యక్షులు ప్రొఫెసర్ జి సాంబశివారెడ్డి , సంస్థ డైరెక్టర్లు డాక్టర్ అవటాల రామాంజులరెడ్డి, రాటాల గోపి పాల్గొన్నారు.

- లయన్స్ క్లబ్ ఆఫ్ కడప అన్నమయ్య అధ్యక్షులు డాక్టర్ ఆర్ రంగనాథరెడ్డి మంగళవారం కడప బాలాజీ నగర్ లోని ఫస్ట్ స్టెప్ ప్రీస్కూల్ ఆధ్వర్యంలో ఉచితంగా మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు.

- వినాయక చవితి పర్వదినాన్ని పురస్కరించుకుని మట్టి వినాయకుడిని పూజిస్తూ పర్యావరణాన్ని కాపాడుదామని వికాస్ విద్యా సంస్థల కరస్పాండెంట్ సుల్తాన్‌బాబా పిలుపునిచ్చారు. మంగళవారం కడప నగరంలోని నాగరాజుపేట రామాలయం వద్ద వినాయకుడి ఉచిత మట్టి విగ్రహాలను ఆయన పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో కోదండ రామాలయం కమిటీ చైర్మన్ కేవీ శ్రీహర్ష, కార్యవర్గ సభ్యులు పాల్గొన్నారు.

- కందుల విద్యాసంస్థల అధినేత డాక్టర్ కందుల చంద్ర ఓబుల్‌రెడ్డి వినాయక చవితి పండుగను పురస్కరించుకుని మంగళవారం కె ఎస్ ఆర్ ఎం కాలేజ్ ఎన్ ఎస్ ఎస్ విభాగం మరియు సివిల్ డిపార్టుమెంట్ వారి ఆధ్వర్యంలో మట్టి వినాయకుల పంపిణీ కార్యక్రమం నిర్వహించారు.

మార్కెట్లలో సందడి

మార్కెట్లలో సందడి నెలకొంది. వినాయక చవితి పర్వదినం నేపథ్యంలో మంగళవారం పూజా సామగ్రి కొనుగోలు చేసేందుకు ప్రజలు భారీ ఎత్తున మార్కెట్లకు తరలివచ్చారు. పండ్లు, పూల దుకాణాలు కిటకిటలాడాయి. - ఫొటోలు: సాక్షి ఫొటోగ్రాఫర్, కడప






వినాయకుడి వేషధారణలో ఆకట్టుకున్న చిన్నారులు

ముందస్తు వేడుకలు

కడప ఎడ్యుకేషన్: కడపలోని నాగార్జున మోడల్ స్కూల్లో ముందస్తు వినాయక చవితి ఉత్సవాలను మంగళవారం ఘనంగా నిర్వహించారు. వినాయకుడి జన్మ వృత్తాంతాన్ని నాటకం ద్వారా ప్రదర్శించి ఆకట్టుకున్నారు. అనంతరం మట్టి విగ్రహాలకు పూజలు నిర్వహించి అనంతరం ఊరేగించి మట్టి వినాయకులను నిమజ్జనం చేశారు. ఈ సందర్భంగా నాగార్జున విద్యాసంస్థల చైర్మెన్ శివశంకర్‌రెడ్డి, డైరెక్టర్ శ్రీదేవిలు విద్యార్థులకు వినాయకు చవితి శుభాకాంక్షలు తెలియ చేశారు. నగరంలోని పలు పాఠశాలలో కూడా ముందస్తు చవితి వేడుకలు నిర్వహించాలి.

క్షయ వ్యాధిపై అవగాహన

కడప ఎడ్యుకేషన్: క్షయ వ్యాధిపై యువత సమాజంలో అవగాహన కల్పించాలని కడప ప్రభుత్వ పురుషుల డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ రవీంద్రనాథ్ సూచించారు. ప్రధానమంత్రి టీబీ ముక్త భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా క్షయవ్యాధిపై ప్రభుత్వ పురుషుల కళాశాలలో అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు, యువత క్షయ వాధి లక్షణాలు, నివారణ పద్ధతుల గురించి తెలుసుకుని సమాజంలో అవగాహన కల్పించాలన్నారు. హెల్త్ డిపార్టుమెంట్ కడప ప్రోగ్రాం అధికారి భాస్కర్ , జిల్లా కో ఆర్డినేటర్ మహేష్ పాల్గొన్నారు.

శాశ్వత స్థానాలు కేటాయించాలి

కడప ఎడ్యుకేషన్: జిల్లాలో ఇటీవల జరిగిన ఉపాధ్యాయుల సాధారణ బదిలీలలో కాంప్లెక్స్ ఉపాధ్యాయులుగా నియమించిన ఆంగ్ల, గణిత ఉపాధ్యాయులకు శాశ్వత స్థానాలు కేటాయించాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం(ఆపస్) రాష్ట్ర కార్యదర్శి వెంకట్రామిరెడ్డి, జిల్లా ప్రధాన కార్యదర్శి కొండారెడ్డి కోరారు. ఈ విషయమై మంగళవారం డీఈఓ షేక్ షంషుద్దీన్‌ను కలిసి వినతిపత్రాన్ని సమర్పించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ 2025 సాధారణ బదిలీల ప్రక్రియలో అన్ని కేటగిరీల వారికి, వారికి సంబంధించిన అన్ని ఖాళీలను చూపి బదిలీలు చేశారన్నారు. అయితే కాంప్లెక్స్ ఉపాధ్యాయుల విషయంలో మాత్రం ఎంతమంది ఉంటే అన్ని ఖాళీలు మాత్రమే చూపి బదిలీలు చేయడం వలన వారికి సరైన న్యాయం జరగలేదని తెలిపారు. అయితే ప్రస్తుతం మెగా డీఎస్సీ నియామకాలు చేపడుతున్నందున కాంప్లెక్స్ ఉపాధ్యాయులకు అన్ని ఖాళీలను చూపించి రెగ్యులర్ స్థానాలు కేటాయించాలన్నారు.

బీఎస్ఎన్ఎల్ ఫ్రీడమ్ ప్లాన్ సద్వినియోగం చేసుకోవాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: బీఎస్ఎన్ఎల్ రూపాయికే అందుబాటులోకి తీసుకువచ్చిన ఫ్రీడమ్ ప్లాన్‌ను వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలని బీఎస్ఎన్ఎల్ జనరల్ మేనేజర్ ముజీబ్ పాషా తెలిపారు. మంగళవారం నగరంలోని బీఎస్ఎన్ఎల్ ప్రధాన కార్యాలయంలో విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ ఈ ప్లాన్ ద్వారా వినియోగదారులకు రోజుకు 2జీబీ డేటా 100 ఎస్ఎంఎస్‌లు, అపరిమిత వాయిస్ కాల్స్ వంటి ప్రయోజనాలు యాక్టివేట్ చేసిన రోజు నుంచే నెల రోజుల పాటు ఒక రూపాయికి లభిస్తున్నాయన్నారు. ఈ ప్రత్యేక ఆఫర్ ఈనెల 31 వరకు అందుబాటులో ఉంటుందన్నారు.

రన్నరప్‌గా కడప


రన్నరప్‌గా ట్రోఫీని అందుకుంటున్న కడప జట్టు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : సీనియర్ మహిళల ఇంటర్ డిస్ట్రిక్ట్ ఫుట్‌బాల్ ఛాంపియన్‌షిప్ 2025-26లో భాగంగా జరిగిన ఫైనల్ మ్యాచ్ ఉత్కంఠ భరితంగా కొనసాగింది. ఈ మ్యాచ్‌లో జిల్లా మహిళల జట్టు అనంతపురంతో తలపడి నిర్ణీత సమయానికి ఎవరూ స్కోర్‌చేయకపోవడంతో మ్యాచ్‌ను డ్రాగా ముగించారు. అనంతరం జరిగిన పెనాల్టీ షూటౌట్‌లో 3-2 స్కోరుతో ఓటమి చవిచూసి రన్నరప్‌తో సరిపెట్టుకోవాల్సి వచ్చింది. ఓటమి చెందినప్పటికీ జిల్లా మహిళలు చూపిన పోరాట పటిమ అందరి ప్రశంసలు అందుకుంది.

జ్ఞాన నైపుణ్యతలే అవకాశాలకు మార్గాలు


సమావేశంలో మాట్లాడుతున్న వైవీయూ వీసీ శ్రీనివాసరావు

కడప ఎడ్యుకేషన్: భవిష్యత్తు అవసరాలకు తగ్గట్టు జ్ఞాన నైపుణ్యాలను పొందినపుడే అవకాశాలను అందుకోగలుగుతామని యోగి వేమన విశ్వవిద్యాలయం వైస్ చాన్సిలర్ ప్రొఫెసర్ అల్లం శ్రీనివాసరావు ఉద్బోధించారు. మంగళవారం రీసెంట్ అప్లికేషన్ ఆఫ్ ఫొటోనిక్ టెక్నాలజీ అనే అంశంపై ప్రత్యేక శాస్త్రీయ ఉపన్యాసం విశ్వవిద్యాలయంలోని అన్నమాచార్య సెనేట్ హాల్లో నిర్వహించారు. ఈ సందర్భంగా వీసీ ఆచార్య అల్లం శ్రీనివాసరావు సైంటిఫిక్ లెక్చర్ ఇచ్చేముందు విద్యార్థుల్లో ప్రేరణ ఉపన్యాసం చేశారు. విద్యార్థులు భవిష్యత్తు కోసం ఎప్పుడూ ప్లాన్ చేసుకోవాలన్నారు. పెరుగుతున్న పోటీకి తగ్గట్టు సన్నద్ధత కాకపోతే అనుకున్న లక్ష్యాలను చేరుకోలేరని గుర్తు చేశారు. అనంతరం ×రీసెంట్ అప్లికేషన్ ఆఫ్ ఫోటోనిక్ టెక్నాలజీ అనే అంశంపై ప్రత్యేక శాస్త్రీయ ఉపన్యాసం చేశారు. ప్రస్తుత ఫొటోనిక్ టెక్నాలజీ లోతైన అవగాహన ద్వారా అధునాతన క్వాంటం టెక్నాలజీని సులువుగా అర్థం చేసుకోవచ్చన్నారు. ఈ కార్యక్రమాన్ని పర్యావరణ శాస్త్ర శాఖ సహ ఆచార్యులు డాక్టర్ టి చంద్రశేఖర్ కార్యక్రమాన్ని సమన్వయం చేశారు.

మొక్కలు నాటిన వీసీ

వీసీ అల్లం శ్రీనివాసరావు బొటానికల్ గార్డెన్‌లో మొక్కలు నాటారు. మంగళవారం విశ్వవిద్యాలయ ప్రాంగణంలోని బొటానికల్ గార్డెన్‌కు తొలిసారిగా వచ్చిన వీసీకి గార్డెన్ డైరెక్టర్ ప్రొఫెసర్ ఏ మధుసూదన్ రెడ్డి అక్కడ పెరుగుతున్న మొక్కలను, వాటి జాతులు గురించి వివరించారు.

మేధో సంపత్తి హక్కులపై అవగాహన

కడప కార్పొరేషన్: మేధో సంపత్తి హక్కులపై పారిశ్రామిక వేత్తలు అవగాహన కలిగి ఉండాలని జిల్లా పరిశ్రమల శాఖ జనరల్ మేనేజర్ చాంద్‌బాషా తెలిపారు. మంగళవారం మానస ఇన్ హోటల్‌లో నేషనల్ ఇన్‌స్టిట్యూట్ ఫర్ మైక్రో, స్మాల్, మీడియం ఎంటర్‌ప్రెన్యూర్స్(ఎన్ఐ-ఎంఎస్ఎంఈ), ఏపీ ఎంఎస్ఎంఈ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో ఇంటలెక్చువల్ ప్రాపర్టీ రైట్స్(ఐపీఆర్)పై అవగాహన సదస్సు నిర్వహించారు. న్యాయవాది విజయ్ క్రిష్ణ, ఐపీఆర్ ఎగ్జిక్యూటివ్ వి. లోకేష్, పరిశ్రమల శాఖ ఏడీ క్రిష్ణారెడ్డి, ఐపీఓ శైలజ, డిక్కీ కన్వీనర్ ఓబిలి శంకర్, పారిశ్రామిక వేత్తలు పాల్గొన్నారు.

వక్ఫ్ భూముల వేలం ప్రశాంతం

కడప సెవెన్‌రోడ్స్ : జిల్లాలోని వక్ఫ్‌బోర్డుకు చెందిన వ్యవసాయ భూముల వేలం మంగళవారం జిల్లా రెవెన్యూ అధికారి ఎం.విశ్వేశ్వరనాయుడు, రాష్ట్ర వక్ఫ్‌బోర్డు సభ్యుడు దావూద్ మౌలాన సమక్షంలో ప్రశాంతంగా ముగిసింది. వేలం కోసం నోటిఫై చేసిన 182.85 ఎకరాల భూమిలో 167.88 ఎకరాల భూమిని లీజుకు కేటాయించారు. ప్రొద్దుటూరులోని తాళ్లమాపురం గ్రామంలోని మోడెంపల్లె మసీదుకు చెందిన 14.97 ఎకరాల భూమి వేలం మాత్రం వాయిదా పడింది. మిగతా వేలం పాటలో మొత్తం 49 మంది పాల్గొన్నారు. గత వేలంతో పోలిస్తే ఈసారి మూడురెట్లు అధిక ఆదాయం లభించినట్లు అధికారులు తెలిపారు. జిల్లా మైనార్టీ సంక్షేమ అధికారి హిదాయతుల్లా, వక్ఫ్‌బోర్డు ఇన్‌స్పెక్టర్ వసీం పాల్గొన్నారు.

ఫీల్డ్ అసిస్టెంట్‌లపై కక్ష సాధింపు చర్యలు తగవు

కడప కోటిరెడ్డిసర్కిల్ : రాష్ట్రవ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్‌లపై సాగుతున్న కక్షసాధింపు చర్యలకు స్వస్తి పలికి, విధుల నుండి తొలగించిన ఫీల్డ్ అసిస్టెంట్లను తక్షణం విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు న్యాయవాది ఎం.సాల్మన్ రాజు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక ప్రకాష్ నగర్ లోని తమ కార్యాలయంలో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా, రాష్ట్రవ్యాప్తంగా ఫీల్డ్ అసిస్టెంట్ల ను టార్గెట్ చేసి తప్పుడు కారణాలతో తొలగిస్తున్నారన్నారు. జిల్లాలో 78 మందిని తొలగించారని, కొంతమందిని రాజకీయ ఒత్తిడికి గురిచేసి బలవంతంగా రాజీనామాలు కూడా చేయిస్తున్నారని ఆరోపించారు. ఈ సమావేశంలో ఫీల్డ్ అసిస్టెంట్ అసోసియేషన్ అధ్యక్షులు గజ్జల సుదర్శన్ రెడ్డి, కార్యదర్శి కే. బయ్యపురెడ్డి, గౌరవ అధ్యక్షులు జాలాశివ, గంగాధర్ ,సుబ్బరాయుడు, ఓబయ్య పాల్గొన్నారు.

ఎలక్ట్రానిక్ వ్యర్థాలపై జాగ్రత్తగా ఉండాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఎలక్ట్రానిక్ వ్యర్థాల పట్ల జాగ్రత్తగా ఉండాలని ఏపీ కాలుష్య నియంత్రణ మండలి కడప ప్రాంతీయ కార్యాలయం పర్యావరణ ఇంజనీర్ సుధ కురుబా తెలిపారు. మంగళవారం హుల్లాడెక్ రీసైక్లింగ్, ఆంధ్రప్రదేశ్ కాలుష్య నియంత్రణ మండలితో కలిసి కడప నగరం ఎర్రముక్కపల్లెలోని హోటల్ మానస ఇన్‌లో ఎలక్ట్రానిక్ వ్యర్థాల (ఈ-వేస్ట్) నిర్వహణపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. హుల్లాడెక్ రీసైక్లింగ్ ఎగ్జిక్యూటివ్ వైస్ ప్రెసిడెంట్ శ్రేయ ఖండేలియా రావత్ , ఆంధ్రప్రదేశ్ ఇండస్ట్రియల్ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్ కార్పొరేషన్‌కి చెందిన శ్రీనివాసన్ మూర్తి పాల్గొన్నారు.

ఫుట్‌బాల్ రాష్ట్ర జట్టుకు నలుగురు ఎంపిక

కడప వైఎస్‌ఆర్ సర్కిల్ : చత్తీస్‌గఢ్‌లోని నారాయణ్‌పూర్‌లో సెప్టెంబరు 6వ తేది నుంచి జరిగే సీనియర్ మహిళల నేషనల్ ఫుట్‌బాల్ జాతీయ చాంపియన్‌షిప్ పోటీలో పాల్గొనే రాష్ట్ర జట్టుకు జిల్లాకు చెందిన నలుగురు క్రీడాకారిణిలు ఎంపికయ్యారు. ప్రధాన జట్టులో టి.అరుణ, అనురాధ, రోహితరెడ్డిలు ఎంపిక కాగా, స్టాండ్‌బైగా వి.వరలక్ష్మి ఎంపికయ్యారు.

రజకుల అభివృద్ధి పట్టని ప్రభుత్వం

కడప కార్పొరేషన్: రజకుల పట్ల కూటమి ప్రభుత్వం చిన్నచూపు చూస్తూ వారి అభివృద్ధిని విస్మరించిందని ఏపీ టూరిజం డైరెక్టర్, వైఎస్సార్‌సీపీ నేత లోగిడి జయన్న విమర్శించారు. మంగళవారం జిల్లా పార్టీ కార్యాలయంలో ఆయన విలేకరులతో మాట్లాడారు. పులివెందుల మండలం, తుమ్మలూరులో యూట్యూబర్ అయిన రజక కులానికి చెందిన ఆదిశేషుపై టీడీపీ ఎంపీటీ సీ దాడి చేయడం హేయమన్నారు. ఆయనపై చేసిన దాడిని తాము తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. ఏపీ రజక సంఘం రాష్ట్ర అధ్యక్షులు పన్నీటి కాశయ్య మాట్లాడుతూ ఆదిశేషుపై దాడికి పాల్పడిన ఎంపీటీసీ విశ్వనాథరెడ్డిపై కేసు నమోదు చేసి అరెస్ట్ చేయాలని కోరారు. ఎంపీటీసీ జి. వెంకటేష్, వైఎస్సార్సీపీ నాయకులు ఎం. నాగార్జున, కె. క్రిష్ణ, ఎం. మల్లయ్య పాల్గొన్నారు.